క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



రహదారికి ఏర్పడిన గొయ్యి

బుట్టాయగూడెం:మండలంలోని మారుమూల గ్రామమైన లంకాలపల్లి నుంచి రేపల్లె వెళ్లే రహదారి మలుపు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడింది. వర్షాలకు మలుపు సమీపంలో ఉన్న కల్వర్టుకు పెద్ద గొయ్యి ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. రేపల్లె, రేగుల పాడు, మోదేలు నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చే గిరిజనులు చూసుకోకుండా వాహనాలను నడిపితే ఆ గోతిలో పడే ప్రమాదం ఉంది. అలాగే పలువురు వ్యవసాయ రైతులు కూడా ఈ రహదారిపై ప్రయాణిస్తుంటారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా అధికారులు వెంటనే ఈ గొయ్యిని పూడ్చాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆత్మీయ కలయిక



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, భారతిరెడ్డిలతో బీవీఎస్ రెడ్డి

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఆయన సతీమణి భారతిరెడ్డిని మంగళవారం బెంగుళూరులోని విమానాశ్రయంలో ఆ పార్టీ స్థానిక నేత బీవీఎస్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

ముగిసిన పదో తరగతి పరీక్షలు



చివరి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

బుట్టాయగూడెం: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం జరిగిన సాంఘిక శాస్త్రం పరీక్షకు బుట్టాయగూడెం, కేఆర్‌పురం, బూసరాజుపల్లి గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో సుమారు 662 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 650 మంది పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ టి.బాబూరావు తెలిపారు. 12 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గత ఏడాది పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు కూడా ఈ పరీక్షలు రాశారని 56 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 36 మంది పరీక్ష రాసినట్లు ఆయన చెప్పారు.

నూకాలమ్మకు విశేష పూజలు



నూకాలమ్మ అమ్మవారు

జంగారెడ్డిగూడెం: శ్రీనూకాలమ్మ ఆలయ 61వ ఉగాది వార్షిక జాతర మహోత్సవంలో 8వ రోజైన మంగళవారం అమ్మవారికి లక్షపుష్పార్చన ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు)తో కూడిన ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో సామూహిక కుంకుమ పూజలు వేదోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ఏడు గంటల నుంచి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త తిప్పాభట్ల వెంకట రామకృష్ణచే ఆలయ విశిష్టతపై ప్రత్యేక ప్రవచనం నిర్వహించారు. డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు) మాట్లాడుతూ ఏప్రిల్ రెండవ బుధవారం ఉదయం 9 గంటల నుంచి ఆలయ యాగశాలలో దేవతల హోమాలు, నూకాలమ్మ మూల మంత్ర హోమం, విశ్వశాంతి కోసం మహా పూర్ణాహుతి నిర్వస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

కంకిపాడు: లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో మంగళవారం రాత్రి కేసు నమోదైంది. ఎస్సై డి.సందీప్ తెలిపిన కథనం మేరకు ఏలూరు సమీపంలోని చింతలపూడి గ్రామానికి చెందిన పల్లపూడి వంశీ (25) గుంటూరు జిల్లా గుండిమెడలో నివాసం ఉంటూ రాడ్ బెండింగ్ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. వంశీకి వివాహమైంది. ఒక కుమార్తె కలదు. సోమవారం గుడివాడలోని తల్లిదండ్రులను చూసి అర్ధరాత్రి సమయంలో గుండిమెడలోని తన ఇంటికి వెళుతుండగా కోమటిగుంట లాకుల వద్ద లారీ ఢీకొంది. 108 అంబులెన్సులో వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి వంశీ మృతి చెందాడు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

అధ్వాన రహదారితో అవస్థలు

- కనీస మరమ్మతులకు నోచుకోని వైనం
- ప్రమాదాల బారిన పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



అధ్వానంగా ఉన్న జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి-లక్కవరం రోడ్డు

జంగారెడ్డిగూడెం: అధ్వానంగా ఉన్న రహదారితో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని ప్రధాన రోడ్డు మార్గాల్లో ఒకటైన దేవులపల్లి-లక్కవరం రోడ్డు అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రయాణం నరక కూపంగా మారింది. మండలంలోని మేజర్ పంచాయతీల్లో ఒకటైన లక్కవరం గ్రామ పంచాయతీని కలుపుతూ ఆయా గ్రామ పంచాయతీలకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. ముఖ్యంగా జంగారెడ్డిగూడెం పట్టణానికి రావాలన్నా, జంగారెడ్డిగూడెం పట్టణం నుంచి ఆయా పంచాయతీల్లోని గ్రామాలకు వెళ్లాలన్నా ఈ రోడ్డు మార్గం నుంచే ప్రయాణించాల్సి ఉంది. ఏ అవసరానికైనా నిమ్మలగూడెం, అమ్మపాలెం, కట్టవపాదలగూడెం తదితర గ్రామాల నుంచి ప్రజలు లక్కవరం, జంగారెడ్డిగూడెం వస్తుంటారు.

ఏళ్ల తరబడి ఇదే పరిస్థితి

దేవులపల్లి-లక్కవరం రోడ్డు మార్గం అధ్వానంగా మారి ఏళ్లు గడుస్తున్నాయి. పెద్ద పెద్ద గుంతలతో కొన్ని చోట్ల రోడ్డు ఉందో లేదో అన్నట్లుగా ఈ రోడ్డు మారింది. ద్విచక్ర వాహనదారులు సైతం ఇబ్బందులు పడేంతగా రోడ్డు అధ్వాన స్థితికి చేరుకుంది. నిమ్మలగూడెం, అమ్మపాలెం, కట్టవపాదలగూడెం తదితర గ్రామాల నుంచి ప్రజలు దైనందిన అవసరాలతో పాటు, రైతులు వారి పంటలను బహిరంగ మార్కెట్లకు తీసుకెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన మార్గం. మౌలిక వసతుల్లో ప్రధాన అవసరాలైన రోడ్డు మార్గాన్ని ఏళ్ల తరబడి అధ్వాన్నంగా ఉండటాన్ని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గాన్ని పునర్ నిర్మించాలని ఆయా గ్రామ పంచాయతీల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు రోడ్డు మార్గాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రయాణానికి ఇబ్బంది

ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనంపై కూడా సవ్యంగా ప్రయాణం చేయలేకపోతున్నాం. ఏళ్ల తరబడి రోడ్డు మార్గం ఇలానే ఉన్నాయి. అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని రోడ్డు మార్గం వేయాలి.

–ఎం.వినోద్, లక్కవరం

వాహనాలు పాడైపోతున్నాయి

వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లాలంటే కష్టంగా ఉంటోంది. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనాలు పాడైపోతున్నాయి. మరమ్మతులకు ఆర్థిక భారం అవుతున్నాయి. అలాగే ప్రయాణాలు సైతం చేయలేకపోతున్నాం. గుంతలు లేని రోడ్డు మార్గాన్ని నిర్మించాలని కోరుతున్నాం.

–వి.సురేష్, కట్టవపాదలగూడెం

ఈకేవైసీకి ఆధార్ క్యాంపు

కుక్కునూరు: ప్రభుత్వం తలపెట్టిన బియ్యం కార్డులో ఈకేవైసీ అనుసంధానం చేసే ప్రక్రియలో తలెత్తిన సాంకేతిక లోపాలను సరిచేయు నిమిత్తం ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేఆర్‌పురం ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ సరి చేసుకునే విషయంపై వాటిని నవీకరణ చేయడం కోసం ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆధార్ క్యాంపు వివరాల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

మూగ జీవాల తాగునీటికి చర్యలు

చింతలపూడి: నియోజకవర్గంలో మూగ జీవాలు వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడే పరిస్థితి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదేశించారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లి గ్రామంలో పశువులకు నీటి దాహార్తి తీర్చేందుకు ఉపాధి హామీ నిధులతో మంజూరైన నీటి తొట్టెల నిర్మాణానికి ఎమ్మెల్యే మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర పంచాయితీ కమిషనర్ డి.పావని, మాజీ ఎంపీపీ తాళ్లూరి రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి



ద్వారకాతిరుమల: నినాదాలు చేస్తున్న సీఐటీయూ నాయకులు



చింతలపూడి: కమిషనర్ పావనికి వినతి పత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

ద్వారకాతిరుమల: ప్రజా సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సీహెచ్ పోతేపల్లి, ద్వారకాతిరుమల గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటినా సంక్షేమ బోర్డును ఎందుకు పునరుద్ధరించలేదని, వాడుకున్న డబ్బును ఎందుకు జమ చేయలేదని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే కార్మికులను సమీకరించి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం మర్చిపోవడం రివాజుగా మారిందని ఆయన విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక వలసలు వెళుతున్నారని, తక్షణమే గృహ నిర్మాణ పథకం ద్వారా పేదలకు గృహాలు మంజూరు చేసి, కార్మికులకు పనులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధు, ప్రతాప్, బండారు శివాజీ, ఆది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాస్‌ను కొనసాగించాలి

చింతలపూడి: ఆప్కాస్ (ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ అవుట్ సోర్సింగ్ సర్వీసెస్)ను కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికుల జీవితాలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించవద్దని కోరుతూ ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం నగర పంచాయితీ కమిషనర్ పావనికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నత్త వెంకటేశ్వరరావు, తానంకి విజయరాజు, వెలగాడి పద్మ, షేక్ సలీం, సోమయ్య, లావేటి వంశీ, బొచ్చ కృష్ణ, ఆర్.ధర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె వాయిదా

కొయ్యలగూడెం: విద్యుత్తు మీటర్ రీడర్లు మంగళవారం నుంచి చేపట్టాల్సిన సమ్మె వాయిదా వేసినట్లు మీటర్ రీడర్స్ డివిజన్ నాయకులు ఎం.మల్లేశ్వరరావు, ఓ.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీటర్ రీడర్స్ డిమాండ్లను పరిష్కరించాలని పది రోజులుగా నిర్వహించిన నిరసన కార్యక్రమాలతో పాటు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. అయితే సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీతో యూనియన్ తరపున చర్చలు నిర్వహించారన్నారు. ముగ్గురు సీఎండీలతో చర్చించి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని సీఎస్ రామకృష్ణకు హామీ ఇచ్చారన్నారు. దీంతో సమ్మెను పది రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు నాయకులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

లింగపాలెం: ధర్మాజీగూడెంలో పేకాట స్థావరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ధర్మాజీగూడెం ఎస్సై వెంకన్న, తన సిబ్బందితో కలిసి నిర్వహించిన దాడుల్లో ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.14,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

వెండి సామగ్రి అపహరణ

కొయ్యలగూడెం: మీడియా సభ్యుడిని అంటూ వచ్చి విలువైన వెండి సామగ్రిని దొంగిలించినట్లు బయ్యనగూడెం పీఏసీఎస్ కార్యదర్శి శివన్నారాయణ ఆరోపించారు. మంగళవారం తన ఉద్యోగ విరమణ కార్యక్రమం కార్యాలయంలో నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మీడియా సభ్యుడు కార్యాలయంలోకి వచ్చినట్లు తెలిపారు. అభినందన సభలో తామంతా బిజీలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తి కార్యాలయంలోకి, అనంతరం తన చాంబర్‌లోకి ప్రవేశించినట్లు తెలిపారు. ఉద్యోగ విరమణ సందర్భంగా తనకు బహూకరించిన బ్యాగులోని సుమారు రూ.20 వేల విలువైన వెండి సామాగ్రి దొంగిలించి పట్టుకుపోయారన్నారు. జరిగిన చోరీ సీసీ పుటేజీలో రికార్డు కాగా ఎస్సై వి.చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

పాస్టర్ మృతిపై విచారణ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న పాస్టర్లు

కుక్కునూరు: పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం కుక్కునూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన సెంటర్ నుంచి రామాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. అనంతరం పాస్టర్స్ ఫెలోషిప్ మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేసి ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో సాయిబాబు, కోలపూడి వసంత్‌కుమార్, రాజ్‌కుమార్, దానియేలు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, పీఎఫ్ సమస్య త్వరలో పరిష్కారం కానుందని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి అన్నారు. ఆయన మంగళవారం నగరంలోని పలు నగరపాలక పాఠశాలలను సందర్శించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా అధ్యక్షుడు షేక్ ముస్తఫా అలీ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో యాగం



యాగం నిర్వహిస్తున్న పండితులు

కొయ్యలగూడెం: సుబ్రహ్మణ్యేశ్వర స్వామి పాశుపత సహిత భువనేశ్వరి యాగం మంగళవారం రెండో రోజుకు చేరుకుంది. బయ్యనగూడెంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మశ్రీ మేడూరి రవితేజ శర్మ ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండప పూజలు, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర పాశుపత అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సూర్య నమస్కారాలు, ఆదిత్యాది నవగ్రహ పూజ, స్వామివారికి సహస్ర పుష్పార్చన కార్యక్రమాలు వేదమంత్రోచ్చారణల నడుమ పండితులు ఘనంగా నిర్వహించారు. 3వ తేదీతో యాగం ముగుస్తుందని ధర్మకర్త బాలం దత్తుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తుమ్మలపల్లి గంగరాజు, గ్రామ కన్వీనర్ బాలం వెంకట రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగాలతోనే పోలవరం ప్రాజెక్ట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

పోలవరం రూరల్: వేల కుటుంబాల త్యాగాల ఫలితంగానే రాష్ట్రానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సాకారమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. మండలంలోని వేలేరుపాడు, సుద్దగుంపు, జగన్నాథపురం, మల్లారం, భూదేవిపేట, రామవరం, ఇప్పలగుంపు తదితర గ్రామాల్లో శత జయంతి వేడుకల్లో భాగంగా సీపీఐ చేపట్టిన ప్రచార జాత రెండో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య నిర్వాసితులకు కుంటి సాకులు చూపించకుండా నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఆలస్యం చేయకుండా ముంపు గ్రామాలన్నిటినీ పునరావస ప్రాంతాలకు తరలించాలన్నారు. అనేక ఏళ్లుగా గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇచ్చి వారికి ప్రభుత్వ ఫలాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు ఎండీ మునీర్, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, వసంతరావు, సన్నేపల్లి సాయిబాబు, బాడిశ రాము, డి.శివకుమార్, కురిమల వెంకటేశ్వర్లు, పిట్టా వీరయ్య, తాటి దుర్గారావు, బంధం నాగేశ్వరావు, కంగాల గంగరాజు, భీమరాజు, సోడే ప్రసాద్, సోడే సత్తిబాబు, బంధం పెద్ద నాగేశ్వరావు, సోడే కన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

జల్లేరు స్పిల్‌వేకు మరమ్మతులు



జల్లేరు జలాశయం స్పిల్‌వే గేట్ల మరమ్మతు పనులు చేస్తున్న కార్మికులు

బుట్టాయగూడెం: మండలంలోని దొరమామిడి సమీపంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం మరమ్మతు పనులను ఇరిగేషన్ అధికారులు చేపట్టారు. సుమారు రూ.8 లక్షల 42 వేలతో స్పిల్‌వే గేట్ల మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. అదే విధంగా జనరేటర్ మెయింటెనెన్స్‌కు సుమారు రూ.3 లక్షలు మంజూరైనట్లు ఇరిగేషన్ ఏఈ టి.సురేష్ తెలిపారు. అదే విధంగా పెద్దవాగు ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రా పరిధిలోని వేలేరుపాడు మండలంలో కాలువల పూడుక తీత పనులు చేపట్టేందుకు రూ.44 లక్షల 36 వేలు నిధులు మంజూరైనట్లు చెప్పారు. అదే విధంగా పోలవరం మండలంలోని మంగవతీదేవీపేట పరిధిలో పనులు చేపట్టేందుకు రూ.8 లక్షల 60 వేలు మంజూరైనట్లు చెప్పారు. త్వరలోనే ఆ పనులు కూడా చేపడతామని తెలిపారు.

13న విద్యార్థులతో చర్చా వేదిక



పోటీల కార్యక్రమం బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): జ్యోతిరావు పూలే, బీఆర్ అంబేడ్కర్‌ల జయంతిని పురస్కరించుకుని పూలే, అంబేడ్కర్ ఆలోచనా విధానంపై ఈ నెల 13న సర్ సీఆర్ రెడ్డి బీఈడీ కాలేజీలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే విద్యార్థులతో చర్చా వేదిక నిర్వహించనున్నట్లు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. ఈ మేరకు బ్రోచర్‌ను మంగళవారం స్థానిక అన్నే భవన్‌లో ఆయన విడుదల చేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, యూటీఎఫ్, మానవత, కేవీపీఎస్, బోంసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలో పాల్గొనే వారు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోగా సెల్ నెంబర్లు 94419 75257, 95150 27023, 94900 98559లో వాట్సాప్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు. 13న మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాయనీ గాయకులచే సావిత్రిబాయి పూలే అంబేడ్కర్ గురించిన ప్రబోధాత్మక సందేశాత్మక పాటలు కళా ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విజేతలకు ప్రశంసా పత్రం, మెమెంటోతో సత్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ వెంకటేశ్వర్లు, కార్యక్రమ కోకన్వీనర్లు జి.రాంబాబు జి.నీలిమ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బాలోత్సవం కమిటీ ప్రతినిధులు కె.శ్రావణ కుమారి, కె.జనని, దేవరకొండ లలిత, ఎం సాయి సిద్ధార్థ, డి.విజ్ఞాన్ పాల్గొన్నారు.

మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు



అంజన్నను దర్శించుకునేందుకు క్యూలో కిక్కిరిసిన భక్తులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో మంగళవారం సందర్భంగా ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామి వారికి ప్రీతికరమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి పలు సేవలు, విరాళాల ద్వారా రూ.1,77,931 సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సుమారు 1500 మంది భక్తులకు స్వామి వారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం కార్య నిర్వాహణాధికారిణి ఆర్‌వీ చందన పూజా కార్యక్రమాలు, భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉపాధి హామీలో నీటి తొట్టెల నిర్మాణం



పశువుల తొట్టె నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

దెందులూరు: ఏలూరు మండలం మాదేపల్లి పంచాయతీ లింగారావు గూడెంలో ఉపాధి హామీ పథకంలో పశువుల తొట్టె నిర్మాణానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం శంకుస్థాపన చేశారు. పశువులకు తాగునీరు అందించేందుకు ఉపాధిహామీ పథకం ద్వారా రూ.33 వేలు అంచనాలతో చేపట్టిన ఈ పనులను వారంలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పశువుల తొట్టె నిర్మాణంతో లింగారావుగూడెంలో సుమారు 300 పశువులకు తాగునీటి సౌకర్యం ఏర్పడుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో జిల్లాలో 411 పశువుల నీటి తొట్టెలు నిర్మించనున్నట్లు తెలిపారు. వీటిని 10 రోజుల్లోగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎంపీడీఓలు, ప్రోగ్రామ్ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పశు సంవర్ధకశాఖ సమన్వయంతో నీటి వసతి ఉన్న ప్రదేశాల్లో 6,600 లీటర్ల నీటి నిల్వ సామర్థ్యంతో తొట్టెలు నిర్మిస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట డ్వామా పీడీ కె.వెంకట సుబ్బారావు, ఆర్‌డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దారు శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీలత, దెందులూరు నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు కె.రఘురామయ్య తదితరులు ఉన్నారు.